క్లుప్తంగా

హెల్పర్లకు శిక్షణ కార్యక్రమం



మాట్లాడుతున్న మిషన్ భగీరథ చీఫ్ ఇంజనీర్ అమరేంద్ర

వేములవాడఅర్బన్: మిషన్ భగీరథ హెల్పర్లకు సోమవారం శిక్షణ కార్యక్రమాన్ని మిషన్ భగీరథ చీఫ్ ఇంజనీర్ సీహెచ్ అమరేంద్ర సోమవారం ప్రారంభించారు. వేములవాడ మండలం అగ్రహారంలోని మిషన్ భగీరథ ట్రీట్‌మెంట్ ప్లాంట్‌లో మిషన్ భగీరథ ద్వారా ఇంటింటికీ మంచినీటి సరఫరా గురించి శిక్షణ అందించారు. హెల్పర్ల విధులు, బాధ్యతలు, సర్వీసు రూల్స్‌లను వివరించారు. కార్యక్రమంలో సిరిసిల్ల సూపరింటెండెంట్ ఇంజినీరు రవీందర్, జానకి, విజయ్‌కుమార్, ప్రేమ్‌చందర్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



వినతిపత్రాన్ని అందిస్తున్న కార్మికులు

కోనరావుపేట: పాఠశాలలో మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఎగమంటి ఎల్లారెడ్డి తహసీల్దార్ విజయ్‌ప్రకాశ్‌రావుకు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మధ్యాహ్న భోజన కార్మికులకు 6 నెలల నుంచి వేతనాలు, కోడిగుడ్ల బిల్లులు రావడం లేదన్నారు. అప్పులు చేసి వంట చేస్తున్నారని తెలిపారు. కోడిగుడ్లు మార్కెట్‌లో ఒక్కోటి రూ.7 ఉండగా ప్రభుత్వం రూ. 4.50 మాత్రమే అందిస్తుందని, దీంతో నిర్వాహకులు నష్టపోతున్నారన్నారు. కార్మికులు పెండింగ్ సమస్యలు పరిష్కరించాలని, లేకుంటే సెప్టెంబర్ 5 నుంచి నిరవధిక సమ్మె చేస్తామన్నారు. కార్యక్రమంలో కార్మికులు పుష్పలత, గడప సంధ్య, దప్పుల లక్ష్మి,లత, గడ్డం కవిత, పులి వసంత, దాసరి మరియ, పాటి కమల, దేవవ్వ పాల్గొన్నారు.

పాఠశాలకు ప్రింటర్ అందజేత



పాఠశాలకు ప్రింటర్ అందజేస్తున్న దాతలు

కోనరావుపేట: మండలం నిమ్మపల్లి ఉన్నత పాఠశాల విద్యార్థుల కోసం ఎన్నారై సుతారి మధు రూ.20 వేల విలువైన ప్రింటర్‌ను సోమవారం అందజేశారు. గ్రామానికి చెందిన మధు స్థానిక పాఠశాలలో చదువుకుని, ప్రస్తుతం ఆస్ట్రేలియాలో ఉంటున్నాడు. కార్యక్రమంలో సర్పంచ్ కదిరె శ్రీనివాస్, ఉపసర్పంచ్ దొంతర వేణి శ్రీనివాస్‌గౌడ్ వెంగలి తిరుపతి, అజీమ్‌పాషా, దువ్వ పురుషోత్తం, గోగు భూపతిరెడ్డి, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వేలాడే విద్యుత్ తీగలు..
ప్రమాద ఘంటికలు

- ప్రాణాలుపోతున్నా పట్టించుకోని వైనం
- సెస్ అధికారుల నిర్లక్ష్య ధోరణి
- ఇళ్లపై నుంచి వెళ్తున్న విద్యుత్ తీగలు

ఎల్లారెడ్డిపేట: ఇక్కడ వేలాడుతున్న విద్యుత్ తీగల మూలంగా జీవుల ప్రాణాలు పోతున్నా పట్టించుకున్న వారు లేరు. ఒకవైపు వంగిన విద్యుత్ స్తంభాలు, ఇళ్లపై తాకుతూ వెళుతున్న విద్యుత్ తీగలతో ఇక్కడి ప్రజలు దిన దిన గండంతో ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని బతుకుతున్నారు. మండల కేంద్రంలోనే కాకుండా గ్రామీణ ప్రాంతాల్లో కూడా ఇదే పరిస్థితిని ప్రజలు ఎదుర్కొంటున్నారు.

ఇళ్లపై నుంచి వెళుతున్న విద్యుత్ తీగలను సరిచేయాలని సెస్ అధికారులకు ఎన్నిసార్లు విజ్ఞప్తులు చేసినా ఫలితం శూన్యం అని అంటున్నారు. వేలాడుతున్నా వాటిని సరిచేయడంలో సెస్ అధికారుల నిర్లక్ష్యం స్పష్టంగా కనబడుతోంది. గత ఏడాది మండలంలోని రాచర్ల బొప్పాపూర్‌లో ఓ యువకుడు ఇంటి ధాబాపైకి ఎక్కగా వేలాడుతున్న విద్యుత్ వైర్లతో షాక్‌కు గురై అక్కడిక్కడే మృతి చెందాడు. అలాగే అస్తవ్యస్తంగా ఉన్న విద్యుత్ తీగల వల్ల పదుల సంఖ్యలో పశువులు, కోతులు మృత్యువాత పడ్డాయి.

ప్రమాదకరంగా విద్యుత్ స్తంభాలు

➡ నారాయణపూర్‌లో వ్యవసాయ పొలంలో వంగిన విద్యుత్ స్తంభాలతో ప్రమాదం ఉందని రైతులు ఆరు నెలలుగా బాధపడుతున్నారు.

➡ మండలంలోని దుమాలలో నివాసాలపై నుంచి ప్రమాదకరంగా విద్యుత్ తీగలు వేలాడుతున్నాయి.

➡ గ్రామశివారులోని వ్యవసాయ పొలాల వద్ద వైర్లు అస్తవ్యస్తంగా ఉండడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు.

➡ మండల కేంద్ర శివారులో మోటరు వేయడానికి వెళ్లిన మద్దుల రాంరెడ్డి అనే రైతు ఏడాది క్రితం విద్యుత్ స్తంభం నుంచి వేలాడుతున్న వైర్ల తాకడంతో షాక్‌కు గురై మరణించాడు.

➡ ప్రతి ఏడాది వేసవిలో విద్యుత్ తీగలు, చెట్లను తాకే స్థలాలను గుర్తించి సెస్ సిబ్బంది చెట్ల కొమ్మలను తొలగించాల్సి ఉండగా, ఏడాదికాలంగా వాటిని తొలగించకపోవడంతో ప్రమాదాలకు కారణమవుతున్నాయి.

➡ కొన్ని ప్రాంతాల్లో చెట్లును ముట్టుకున్నా, షాక్‌కు గురై చనిపోయే ప్రమాదం ఉంది. ఇలాంటి పరిస్థితిపై సంబంధిత శాఖ స్పందించపోవడం బాధకరం.



ఇళ్లు, చెట్లను తాకుతూ వెళ్తున్న హైటెన్షన్ విద్యుత్ వైర్లు



నారాయణపూర్‌లో పొలంలో వంగిన స్తంభం

వానరాలు మృత్యువాత..

చెట్ల కొమ్మలపై గెంతులు వేసే కోతులు వాటిని తాకుతున్న విద్యుత్ వైర్లతో షాక్‌కు గురై కొద్ది రోజుల వ్యవధిలో సుమారు 15 వానరాలు మృత్యువాత పడ్డాయి. చెట్టు కొమ్మలను తొలగించాలని సెస్ సిబ్బంది దృష్టికి తీసుకుపోయినా నిర్లక్ష్యంగా సమాధానం ఇస్తున్నారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. వెంటనే సిబ్బంది స్పందించి ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

కొత్తవి వేయాలి



చెట్లను తాకుతున్న విద్యుత్ వైర్లను వెంటనే తొలగించాలి. వేలాడుతున్న విద్యుత్ తీగల వల్ల షాక్‌కు గురవుతున్నారు. ప్రమాదకరంగా ఉన్న స్తంభాలను తొలగించి కొత్తవి ఏర్పాటు చేయాలి.

– నిమ్మ నారాయణరెడ్డి, నారాయణపూర్

శిథిలావస్థలో స్తంభాలు



మండల కేంద్రంలో విద్యుత్ స్తంభాలు శిథిలావస్థకు చేరుకోని కూలడానికి సిద్ధంగా ఉన్నాయి. విద్యుత్ తీగలు ఇళ్లను తాకుతున్నాయి. ఈ విషయంపై ప్రజావాణిలో ఫిర్యాదు చేసిన ఫలితం లేదు.

– ఒగ్గు బాల్‌రాజుయాదవ్, ఎల్లారెడ్డిపేట

సమస్యలన్నీ పరిష్కరిస్తాం



వంగిన స్తంభాలను తొలగించి కొత్త స్తంభాలు ఏర్పాటు చేస్తాం. విద్యుత్ తీగలను తాకుతున్న చెట్లను గుర్తించి తొలగిస్తాం. వేలాడుతున్న విద్యుత్ తీగలను సరిచేస్తాం. సమస్య ఉన్న ప్రాంతాలను పరిశీలించి, సమస్య లేకుండా చూస్తాం.

– పృథ్వీ, సెస్ ఏఈ, ఎల్లారెడ్డిపేట

సమాచారం

1న ఎస్జీఎఫ్ క్రీడా పోటీలకు ఎంపిక

కోనరావుపేట: మండల స్థాయిలో నిర్వహించే ఎస్జీఎఫ్ క్రీడా పోటీలకు అండర్–14, 17 బాల బాలికలకు ఎంపిక చేయనున్నట్లు ధర్మారం పీఈటీ, ఎస్జీఫ్ మండల కన్వీనర్ ఎస్‌కే మొయినొద్దీన్ ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని కనగర్తి ఉన్నత పాఠశాల మైదానంలో కబడ్డీ, వాలీబాల్, ఖోఖో, అథ్లెటిక్స్ విభాగాల్లో సెప్టెంబర్ 1న బాలికలకు, సెప్టెంబర్ 2న బాలురకు ఎంపిక చేస్తామన్నారు. మండలంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులు తమ పుట్టిన తేదీ ధ్రువీకరణపత్రాన్ని తీసుకుని ఉదయం 9 గంటలకు హాజరు కావాలని కోరారు. పూర్తి వివరాలకు కనగర్తి పీఈటీ అజయ్‌కుమార్ (సెల్ నెం. 94414 56385)ను సంప్రదించాలన్నారు.

నియామకం

కాంగ్రెస్ బీసీ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడిగా కనుకయ్య

వేములవాడఅర్బన్: వేములవాడ మండలం రుద్రవరం గ్రామానికి చెందిన కత్తి కనుకయ్యను కాంగ్రెస్ బీసీ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడిగా సోమవారం నియమిస్తూ డీసీసీ అధ్యక్షుడు ఆది శ్రీనివాస్ పత్రాన్ని అందజేశారు.

ఫిషరీష్ కమిటీ మండల అధ్యక్షుడిగా మల్లేశం

ఇల్లంతకుంట: మండలంలోని జవారిపేట గ్రామానికి చెందిన జెట్టి మల్లేశంను కాంగ్రెస్ ఫిషరీష్ కమిటీ మండల అధ్యక్షుడిగా నియమించినట్లు కాంగ్రెస్ ఫిషరీస్ కమిటీ జిల్లా అధ్యక్షుడు రవీందర్ ఉత్తర్వులు జారీ చేశారు.

మండల అధ్యక్షుడిగా లక్ష్మారెడ్డి

ఎల్లారెడ్డిపేట: కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడిగా సద్ది లక్ష్మారెడ్డిని నియమిస్తూ డీసీసీ అధ్యక్షుడు ఆది శ్రీనివాస్ ఉత్తర్వులు జారీ చేశారు. ఉత్తర్వులను మాజీ అధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య లక్ష్మారెడ్డికి అందజేశారు. నియామాకానికి సహకరించిన నియోజకవర్గం ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు ఆది శ్రీనివాస్, మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్‌గౌడ్ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు గౌస్, నాయకులు పాల్గొన్నారు.

బీసీబంధు పథకం నిరంతర ప్రక్రియ

- దశలవారీగా లబ్ధిదారులకు సాయం
- చొప్పదండి ఎమ్మెల్యే సుంకె రవిశంకర్
- 47 మందికి చెక్కుల పంపిణీ

బోయినపల్లి: బీసీ బంధు పథకం నిరంతరం కొనసాగే పథకమని, దశల వారీగా లబ్ధిదారులకు ఆర్థిక సాయం అందిస్తామని ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ అన్నారు. సోమవారం సాయంత్రం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో మండలానికి చెందిన 47 మంది లబ్ధిదారులకు రూ.లక్ష చొప్పున మంజూరైన చెక్కులను పంపిణీ చేసి మాట్లాడారు. రాష్ట్రంలో కుల వృత్తులకు, చేతి వృత్తులకు జీవం పోసేందుకు సీఎం కేసీఆర్ బీసీబంధు పథకం ప్రవేశపెట్టినట్లు తెలిపారు. బీసీ కులాల్లో లేబర్ ఓనర్ కావాలనేదే తమ ఆశయమన్నారు. క్షేత్రస్థాయిలో విచారణ అనంతరం బీసీబంధు లబ్ధిదారుల ఎంపిక జరుగుతుందని, తొలి విడుతలో 300 మంది లబ్ధిదారులు ఎంపికయ్యారని తెలిపారు.

హైలెవల్ కల్వర్టుకు శంకుస్థాపన

బోయినపల్లి నుంచి వేములవాడ వెళ్లే దారిలో మండలంలోని స్తంభంపల్లి గంజివాగులో లోలెవల్ కల్వర్టు స్థానంలో రూ. 1.80 కోట్ల అంచనాలతో హైలెవల్ బ్రిడ్జి నిర్మాణానికి ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ సోమవారం సాయంత్రం శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ వేణుగోపాల్, సర్పంచులు లతశ్రీ, జ్యోతి, ఎంపీటీసీలు బుచ్చమ్మ, ఉపేందర్, ఏఎంసీ చైర్మన్ లెంకల సత్యనారాయణరెడ్డి, సెస్ డైరెక్టర్ కొట్టెపెల్లి సుధాకర్, పీఆర్ డీఈఈ సత్యనారాయణ, మాజీ సెస్ డైరెక్టర్ మల్లేశం, ఎంపీడీవో నల్లా రాజేందర్‌రెడ్డి, మండల కోఆప్షన్ సభ్యుడు మహ్మద్ అజ్జు, కొనుకటి లచ్చిరెడ్డి, సంబ లక్ష్మీరాజం, గుంటి శంకర్, సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుంకె రవిశంకర్

ఎమ్మెల్యేకు రాఖీ కట్టిన మహిళలు

బోయినపల్లి: మండల కేంద్రంలో ఆదివారం సాయంత్రం ఎమ్మెల్యే సుంకె రవిశంకర్‌కు మహిళా ప్రజాప్రతినిధులు ముందస్తుగా రాఖీ కట్టారు. స్థానిక సర్పంచ్ గుంటి లతశ్రీ, ఎంపీటీసీ సంబ బుచ్చమ్మ మహిళా సర్పంచులు, ఎంపీటీసీలు జూలపల్లి స్వప్నాంజలి, ఐరెడ్డి గీతారెడ్డి రాఖీ కట్టి శుభాకాంక్షలు తెలిపారు.

ర్యాలీలు.. రాస్తారోకోలు

- కలెక్టరేట్ ఎదుట ధర్నాలు
- పట్టణంలో నిరసన ప్రదర్శనలు
- ప్రభుత్వం తీరుపై విమర్శలు



అంబేడ్కర్ చౌరస్తాలో రెండో ఏఎన్ఎంల రాస్తారోకో



కలెక్టరేట్ ఎదుట సమగ్ర శిక్ష ఉద్యోగులు ధర్నా

సిరిసిల్లటౌన్: సిరిసిల్ల జిల్లా కేంద్రం దద్దరిల్లింది. వరుస ధర్నాలు.. నిరసనలతో సోమవారం అట్టుడికింది. రాష్ట్ర ప్రభుత్వ వైఖరిపై ప్రజాసంఘాల ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన నిర్వహించగా, మాజీ సర్పంచులు, రెండో ఏఎన్ఎంలు, సమగ్ర శిక్ష ఉద్యోగులు, ఎస్సీ కార్పొరేషన్ దరఖాస్తుదారులు నిరసనలతో హోరెత్తించారు.

రెండో ఏఎన్ఎంల సమస్యలు పరిష్కరించాలి

సమస్యలు పరిష్కరించాలని రెండో ఏఎన్ఎంలు ఏఐటీయూసీ ఆధ్వర్యంలో అంబేడ్కర్ చౌరస్తాలో రాస్తారోకో చేపట్టారు. వారు మాట్లాడుతూ పదిహేనేళ్లుగా విధులు నిర్వర్తిస్తున్న తమను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించకుండా నోటిఫికేషన్ ఇవ్వడాన్ని తప్పుబట్టారు. పట్టణంలో భారీ ర్యాలీ చేపట్టారు. నాయకులు సామల మల్లేశం, కడారి రాములు తదితరులు సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో వనజ, రేణుక, విజయలక్ష్మి, శ్రీలత, పద్మ, మాధవి, రేఖ, రాజేశ్వరి, పద్మ, సరోజ, ఇందిర, కరుణశ్రీ, సునంద తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగాలు పర్మినెంట్ చేయండి

తమ ఉద్యోగాలకు ప్రభుత్వం వెంటనే పర్మినెంట్ చేయాలని సమగ్ర శిక్ష అభియాన్ ఉద్యోగులు డిమాండ్ చేశారు. ఈమేరకు స్థానిక అంబేడ్కర్ చౌరస్తా నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ తీశారు. కలెక్టరేట్ వద్ద బైఠాయించారు. సమగ్ర శిక్ష ఉద్యోగుల జేఏసీ నాయకులు తుమ్మ రాజేందర్, అబ్దుల్ కయ్యూం, ఇప్పపూల దేవేందర్, నగేశ్, రవి, చైతన్య, జయంతి, లావణ్య, రాజేశ్వర్‌రావు, చందన్ ఉన్నారు.

రెండేళ్లుగా ట్రాక్టర్లు ఇవ్వట్లేదు

రెండేళ్ల క్రితం ఎస్సీ కార్పొరేషన్ ద్వారా ట్రాక్టర్లు పొందడానికి అర్హులైన తమకు ఇప్పటి వరకు ప్రభుత్వం వాహనాలు ఇవ్వలేదని 2020–21 బ్యాచ్ లబ్ధిదారులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈమేరకు కలెక్టరేట్ ముందు ధర్నా చేపట్టి మాట్లాడారు. అధికారుల తప్పిదంతో ఇప్పటి వరకు తమకు వాహనాలు అందడం లేదన్నారు. వెంటనే తమకు ట్రాక్టర్లను మంజూరి చేయాలని డిమాండ్ చేస్తూ కలెక్టరేట్‌లో వినతిపత్రం అందించారు. లబ్ధిదారులు ప్రశాంత్, అనీల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కొనసాగిన మాజీ సర్పంచుల దీక్షలు

మాజీ సర్పంచులు ఇరవై ఒకటో రోజు సోమవారం నిరసన దీక్షలను కొనసాగించారు. వారు మాట్లాడుతూ ఇన్ని రోజులుగా తాము నిరవధిక రిలేదీక్షలు చేపడుతుంటే ప్రభుత్వం పట్టింపు లేకుండా ఉండటంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. దీక్షల్లో బొడ్డు దేవయ్య, సంపునూరి మల్లేశంగౌడ్, అలువాల లక్ష్మణ్, దేవుని నర్సయ్య, గోవర్ధన్, సత్యనారాయణరెడ్డి, పైలూరి రాజమల్లు తదితరులు పాల్గొన్నారు.

‘కేటీఆర్ హామీ.. నెరవేర్చరేమి?’

సిరిసిల్లటౌన్: కార్మికవాడల్లోని నివేశన స్థలాలకు రిజిస్ట్రేషన్ హక్కులు కల్పిస్తామని మంత్రి కేటీఆర్ ఇచ్చిన హామీ నెరవేర్చడం లేదని సీపీఎం జిల్లా కార్యదర్శి మూశం రమేశ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈనెల 30న పార్టీ ఆధ్వర్యంలో చేపడుతున్న చలో కలెక్టరేట్ ముట్టడి కరపత్రాలను సిరిసిల్ల బీవైనగర్ లోని పార్టీ ఆఫీసులో సోమవారం ఆవిష్కరించారు. బీవైనగర్, సుందరయ్యనగర్, పద్మనగర్, రాజీవ్‌నగర్, తారకరామానగర్, ఇందిరానగర్ ప్రాంతాల్లోని నివేశన స్థలాలకు సర్వేనంబరు ఆధారంగా రిజిస్ట్రేషన్ హక్కులు కల్పించాలని కోరారు. నలభై ఏళ్ల క్రితం ఆ స్థలాల్లో నిరుపేదలు ఇళ్లు నిర్మించుకున్నారని ఇన్నేళ్లుగా వాటిపై రిజిస్ట్రేషన్ హక్కులు కల్పించకపోవడంతో బ్యాంకు రుణాలు, కొత్తగా ఇండ్లు కట్టుకోలేని పరిస్థితులు ఏర్పడ్డాయన్నారు. ఈవిషయాన్ని కేటీఆర్ దృష్టికి తీసుకెళ్లగా రిజిస్ట్రేషన్ చేసుకునేందుకు వీలుగా జీవో జారీ చేస్తామని హామీ ఇచ్చినట్లు గుర్తుచేశారు. నెలలు గడుస్తున్నా హామీ అమలు కాలేదన్నారు. కోడం రమణ, ఎలిగేటి రాజశేఖర్, శ్రీరాం సదానందం, వడ్నాల వీరేశం తదితరులున్నారు.

కెనాల్ కబ్జాపై విచారణ

ముస్తాబాద్: మండలంలోని తెర్లుమద్ది, సేవాలాల్ తండా గ్రామాల్లో మానేరు కెనాల్ కబ్జాపై కలెక్టర్‌కు ఇచ్చిన ఫిర్యాదు మేరకు విచారణ చేసినట్లు నీటిపారుదలశాఖ ఏఈ వంశీకృష్ణ తెలిపారు. కలెక్టర్ ఆదేశాల మేరకు గ్రావెల్ కెనాల్‌తోపాటు, చెక్‌డ్యామ్‌ను పరిశీలించామన్నారు. డీఈఈ ఆదేశాల మేరకు కలెక్టర్‌కు వాస్తవిక నివేదిక ఇస్తామన్నారు. కాగా తెర్లుమద్ది, తండాల్లో కబ్జాకు గురైన కెనాల్‌ను పరిరక్షించి ఆదుకోవాలని రైతులు కోరారు.

ఆలయ నిర్మాణానికి భూమిపూజ

రుద్రంగి: మండల కేంద్రంలోని దసరా నాయక్ తండాలో సేవాలాల్ మహరాజ్, మెరమ్మ తల్లి ఆలయ నిర్మాణానికి సోమవారం తండా వాసులు భూమిపూజ చేశారు. దాతలు ముందుకు వచ్చి ఆలయ నిర్మాణానికి సహకరించాలని, ప్రభుత్వం దేవాదాయ శాఖ నుంచి నిధులు మంజూరు చేయాలని కోరారు. తండా వాసులు లావుడ్య మోహన్, రాజు, సత్యం, లింబా, ప్రియ, తిరుపతి, దేవా, సంతోశ్, లక్ష్మణ్, శ్రీనివాస్, పాల్గొన్నారు.

రాఖీ పౌర్ణమి రోజు సంస్కృత భాషా దినోత్సవం

- శ్రీరాజరాజేశ్వర సంస్కృత విద్యా సంస్థ ప్రిన్సిపాల్ డాక్టర్ ఆవుల మల్లారెడ్డి

వేములవాడ: రాఖీ పౌర్ణమి రోజు సంస్కృత భాషా దినోత్సవాన్ని ఘనంగా జరుపుకోవాలని శ్రీరాజరాజేశ్వర సంస్కృత విద్యా సంస్థ ప్రిన్సిపాల్ డాక్టర్ ఆవుల మల్లారెడ్డి అన్నారు. సోమవారం సంస్కృత భాషా వారోత్సవాల ప్రారంభ సదస్సులో ఆయన మాట్లాడారు. ఈ వారోత్సవాలను సోమవారం నుంచి ఆదివారం వరకు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. భారతీయ సంస్కృతి సాంప్రదాయాలతో పాటు కవిత్వం, తర్కం, వ్యాకరణం, తత్వం, గణితం, ఖగోళం వంటి శాస్త్ర సాంకేతిక అంశాలన్నీ సంస్కృత సాహిత్యంలో పొందుపరచబడ్డాయన్నారు. సంస్కృత భాష గొప్పతనం, ఆ సాహిత్యంలో ఉత్తమ విలువలను అందరికీ తెలియజేసేలా ఈ కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు తెలిపారు. చిన్నారులను ఉత్తమ పౌరులను తయారు చేయాలంటే వారికి చిన్నతనం నుంచే నైతిక విలువలతో కూడిన విద్యను బోధించాలని, అలాగే వారిలో సత్ప్రవర్తనను కలిగించే ధర్మబోధనను చేయాలని, అప్పుడే వారు ఉత్తమ పౌరులుగా తయారవుతారన్నారు. ఇలాంటి గొప్ప విలువలతో నిండి ఉన్న సంస్కృత సాహిత్యాన్ని విద్యార్థులకు దశల వారీగా బోధిస్తే తప్పకుండా వారు ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దబడతారన్నారు. కార్యక్రమంలో వైస్‌ప్రిన్సిపాల్ రమాదేవి, అధ్యాపకులు డాక్టర్ చందా ప్రకాశ్, భక్తియర్, డాక్టర్ సందెవేని తిరుపతి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ మల్లారెడ్డి

విద్యార్థులు క్రీడల్లో రాణించాలి

వేములవాడరూరల్: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో కూడా రాణించాలని వేములవాడ రూరల్ ఎంపీపీ బండ మల్లేశంయాదవ్ అన్నారు. వేములవాడ మండలంలోని హన్మాజీపేట ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు ఆటల పోటీలను ఆయన ప్రారంభించారు. సర్పంచుల ఫోరం అధ్యక్షుడు తిరుపతి, పాఠశాల క్రీడా సమాఖ్య జిల్లా కార్యదర్శి దేవత ప్రభాకర్, జెడ్పీహెచ్ఎస్ ఇన్‌చార్జి దేవరాజు, రూరల్ మండల ఇన్‌చార్జి నాంపల్లి శ్రీనివాస్, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు జంకె శ్రీనివాస్‌రెడ్డి, పీడీ హమీద్, రాష్ట్ర వ్యాయామ ఉపాధ్యాయ సంఘం కార్యదర్శి జోగినిపల్లి రవీందర్‌రావు పాల్గొన్నారు.

హైమాస్ట్ లైట్లు ప్రారంభం

మండలంలోని చెక్కపల్లి గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన హైమాస్ట్ లైట్లను ఎంపీపీ బండ మల్లేశంయాదవ్ ప్రారంభించారు. మండల పరిషత్ నిధుల నుంచి ప్రత్యేకంగా ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో సర్పంచులు జైపాల్‌రెడ్డి, ఏశ తిరుపతి, మార్కెట్ వైస్‌చైర్మన్ బాల్‌రెడ్డి, వార్డుసభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

దివ్యాంగులకు అవకాశం కల్పించాలి

ముస్తాబాద్: సిరిసిల్ల జిల్లా కేంద్రంలో ప్రభుత్వ మెడికల్ కళాశాలలో కాంట్రాక్టు పద్ధతిలో నియమిస్తున్న పోస్టుల్లో దివ్యాంగులకు అవకాశాలు కల్పించాలని సంఘం ప్రతినిధి బాలయ్యయాదవ్ కోరారు.

పరామర్శ

తంగళ్లపల్లి: మండలంలోని జిల్లెల్ల గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు అబ్బాడి అనిల్‌రెడ్డి తండ్రి వెంకట్‌రెడ్డి అనారోగ్యంతో మరణించగా సోమవారం బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య పరామర్శించారు.

పాఠశాలలో కోతుల భీభత్సం

కోనరావుపేట: మండలం కనగర్తి ప్రాథమిక పాఠశాలలో కోతులు భీభత్సాన్ని సృష్టించాయి. ఆదివారం తరగతి గదిలోని కిటికీ ద్వారా లోపలికి ప్రవేశించిన కోతుల గుంపు గదిలో ఉన్న బియ్యాన్ని పారబోశాయి. కోతుల బెడద ఎక్కువ అవుతుందని, కోతుల నివారణకు చర్యలు తీసుకోవాలని కోరారు.

రైతు ఉత్పత్తులకు జాతీయస్థాయిలో మార్కెటింగ్

ముస్తాబాద్: రైతులు తాము పండించిన ధాన్యానికి జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో మార్కెటింగ్ కల్పించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని పోతుగల్ సింగిల్‌విండో చైర్మన్ తన్నీరు బాపురావు తెలిపారు. హైదరాబాద్‌లోని టిస్కాబ్ కార్యాలయంలో నిర్వహించిన సింగిల్‌విండో చైర్మన్ల సదస్సులో రైతులు పండించిన అన్ని రకాల పంటలకు మార్కెటింగ్ సదుపాయాన్ని ఏ విధంగా కల్పించాలనే విషయంపై అవగాహన కల్పించారన్నారు. ఏఎంసీలు, సింగిల్‌విండో కార్యాలయాలలో ఆన్‌లైన్ పద్ధతిలో ధరలను తెలుసుకునే వీలు ఉందన్నారు. దీనిద్వారా రైతులు అధిక ధరలు ఉన్న ప్రాంతానికి తమ ఉత్పత్తులను రవాణా చేసే విధంగా పీఏసీఎస్‌లు కృషి చేస్తాయన్నారు.

వ్యవసాయ పరిశోధనా సంస్థను సందర్శించిన విద్యార్థినులు

వేములవాడ: జగిత్యాల జిల్లా పొలాసలోని ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయాన్ని వేములవాడకు చెందిన కేటీఎస్ స్కూల్ విద్యార్థినులు సందర్శించారు.

చంద్రయాన్–3పై అవగాహన

తంగళ్లపల్లి: మండలంలోని మండెపల్లి గ్రామంలో సరస్వతి విద్యానికేతన్ పాఠశాల విద్యార్థులచే చంద్రయాన్–3పై ప్రజలకు సోమవారం అవగాహన కల్పించారు. పాఠశాల కరస్పాండెంట్ కొక్కు శ్రీనివాస్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ మండల అధ్యక్షుడికి సన్మానం

తంగళ్లపల్లి: కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడిగా జలగం ప్రవీణ్ రెండోసారి నియమాకమైన సందర్భంగా ఆయనని మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు సోమవారం ఘనంగా సన్మానించారు.



గుడి చెరువు ఖాళీ స్థలంలోకి వెళ్లే రోడ్డు



ఓపెన్‌స్లాబ్ కింద పేరుకుపోయిన చెత్త



ఆలయం ముందు ట్రాఫిక్ సమస్య

శివ.. శివ.. ఇవేం బాధలు

వేములవాడ: దక్షిణకాశీగా ప్రసిద్ధి చెందిన వేములవాడ రాజన్న దర్శనానికి వచ్చే భక్తులు అడుగడుగునా అవస్థలు పడుతున్నారు. శ్రావణమాసంలో శివ పూజ శ్రేష్ఠంగా భావించి రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచే కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు తరలివస్తున్నారు. వచ్చిన భక్తులకు సరైన రోడ్లు, సౌకర్యాలు లేక ఇబ్బందులు పడుతున్నారు. సంవత్సరానికి రూ.వంద కోట్ల ఆదాయం వస్తున్నా, భక్తులకు కల్పించాల్సిన సౌకర్యాలు మాత్రం అంతంత మాత్రంగానే ఉంటున్నాయంటూ భక్తులు ఆరోపిస్తున్నారు.



వసతి గదులు కూల్చివేతతో రోడ్డుకు ఆటంకం